క్లుప్తంగా

నేడు అయ్యప్ప మకరజ్యోతి దర్శనం

కోడూరు: అపర శబరిమలగా పేరుగాంచిన కోడూరు అయ్యప్పస్వామి వారి దేవాలయం వద్ద శనివారం భక్తులకు మకరజ్యోతి దర్శనాన్ని కల్పిస్తామని ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త బడే భావన్నారాయణ శుక్రవారం తెలిపారు. ఉదయం ఆలయంలోని మూలమూర్తికి ప్రత్యేక అభిషేకాలు జరుగుతాయని, సాయంత్రం స్వామివారి నగలను ఊరేగిస్తామని చెప్పారు. ఊరేగింపు అనంతరం అయ్యప్పకు ప్రత్యేక అలంకారం చేసి మకరజ్యోతి దర్శనాన్ని కల్పిస్తామన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన

కోడూరు: కోడూరు రైతు భరోసా కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ షేక్ లతీఫ్‌పాషా శుక్రవారం పరిశీలించారు. కేంద్రంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రంగుమారిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని రైతులు తహసీల్దార్‌ను కోరారు. తహసీల్దార్ మాట్లాడుతూ రంగు మారిన, తడిచిన ధాన్యం శాంపుల్స్‌ను కొనుగోలు కేంద్రంలో అందిస్తే వాటిని పరిశీలించి జిల్లా అధికారులతో మాట్లాడి రైతులకు న్యాయం జరిగేలా చూస్తామని చెప్పారు. అనంతరం కేంద్రంలో ఇప్పటివరకు కొనుగోలు చేసిన ధాన్యం, రైతులకు నగదు చెల్లింపు వివరాలను అడిగి తెలుసుకున్నారు. పీఏసీఎస్ సీఈఓ అర్జా వెంకట నగరాయులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

శస్త్ర చికిత్సకు ఆర్థిక సాయం

పెడన: పెడనకు చెందిన కుర్మా నాగార్జున కుమార్తె నాగవల్లి (6) గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతోంది. ఆమె శస్త్రచికిత్సకు సహాయ ఫౌండేషన్ ద్వారా మోటేపల్లి నాగరాజు రూ.11వేలను శుక్రవారం అందజేశారు. నాగవల్లి తరుచూ అనారోగ్యానికి గురవుతుండటంతో గుంటూరులోని జీజీహెచ్‌లో చూపించడంతో గుండె సంబంధిత వ్యాధి ఉందని గుర్తించి ఆరోగ్యశ్రీ ద్వారా శస్త్రచికిత్స చేస్తారని వైద్యులు నాగవల్లి తండ్రి నాగార్జునకు తెలిపారు. తిరుపతిలోని ఆస్పత్రికి సిఫార్సు చేయడంతో అక్కడ ఈ నెల 14న ఆపరేషన్ చేస్తారని చెప్పారు. ఖర్చులకు డబ్బులు లేక సహాయ ఫౌండేషన్ వారిని నాగార్జున సంప్రదించాడు. ఫౌండేషన్ సభ్యుడు మోటేపల్లి నాగరాజు స్పందించి ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు ఉస్మాన్‌బాషా, వార్డు కౌన్సిలర్ మెట్ల గోపీ ప్రసాద్, రౌతుల ప్రసాద్, అమీన్, కృష్ణమూర్తి, నాని, సాంబశివరావు, సందీప్ పాల్గొన్నారు.

కేపీ రెడ్డయ్యకు నివాళి



మచిలీపట్నంటౌన్: మాజీ ఎంపీ కేపీ రెడ్డయ్య భౌతికకాయాన్ని మచిలీపట్నం నియోజకవర్గ నాయకులు శుక్రవారం విజయవాడలో సందర్శించారు. పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ నాయకులు పేర్ని కృష్ణమూర్తి (కిట్టు), నగర అధ్యక్షుడు షేక్ సలార్ దాదా, అర్బన్ బ్యాంక్ మాజీ చైర్మన్ బొర్రా విఠల్ తదితరులు రెడ్డయ్య కుమారుడు, పెనమలూరు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథికి, ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

గౌడ సంఘం నేతల దాతృత్వం

ఘంటసాల (అవనిగడ్డ): రాష్ట్ర గౌడ సంఘాల నాయకులు దాతృత్వం చూపారు. ఘంటసాల మండలం లంకపల్లికి చెందిన కాగిత రవికిరణ్ ఇటీవల ప్రమాదవశాత్తూ మృతి చెందగా శుక్రవారం రూ.లక్షన్నర సాయం అందజేశారు. గీత బంధు సేవా ట్రస్ట్ రూ.35 వేలు, జై గౌడ సేన రూ.65 వేలు, కారంకి ఫౌండేషన్ రూ.50 వేలు కలిపి మొత్తం రూ.లక్షన్నర సహాయాన్ని చల్లపల్లి జెడ్పీటీసీ సభ్యురాలు రాజులపాటి కల్యాణి చేతులమీదుగా అందజేశారు. గీత బంధు సేవా ట్రస్ట్, జైగౌడ సేన, కారంకి ఫౌండేషన్ సేవా సంస్థల ప్రతినిధులు రాజులపాటి కల్యాణి, చెన్ను విజయలక్ష్మి, రాజులపాటి శివ ప్రసాద్, మోర్ల ఏడుకొండలు, కారంకి సత్యనారాయణ చొరవతో సహాయం అందజేశారు.

బహుమతుల ప్రదానం

పెడన: ఎనిమిదో సచివాలయం పరిధిలో వార్డు కౌన్సిలర్లు ఏర్పాటు చేసిన రంగవల్లుల పోటీల విజేతలకు మున్సిపల్ చైర్‌పర్సన్ బళ్ల జ్యోత్స్నరాణి బహుమతులను అందజేశారు. ఆమె మాట్లాడుతూ సంస్కృతి సంప్రదాయలను గుర్తుచేసే పర్వదినం భోగి, సంక్రాంతి, కనుమ పండుగలన్నారు. కార్యక్రమ నిర్వాహకులు, కౌన్సిలర్లు కొసనం కరుణకుమారి, పిచ్చుక సతీష్‌బాబును అభినందించారు. వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ బండారు మల్లి, నాయకులు సత్యనారాయణ పాల్గొన్నారు.

నేడు గోదారంగనాథుల కల్యాణం

కోడూరు: ధనుర్మాసం ముగింపును పురస్కరించుకొని ఉల్లిపాలెంలోని గోదా, రాజ్యలక్ష్మీ సమేత శ్రీమన్నారాయణ స్వామి వారి ఆలయంలో శనివారం గోదారంగనాథుల కల్యాణాన్ని నిర్వహిస్తామని అష్టాక్షరీ పీఠాధిపతి త్రిదండి అష్టాక్షరీ సంపత్ కుమార రామానుజీయర్ స్వామిజీ తెలిపారు. కోడూరు శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి, లింగారెడ్డిపాలెం, ఇస్మాయిల్ బేగ్ పేట శ్రీరామమందిరాల్లో కూడా గోదా రంగనాథుల కల్యాణోత్సవాలు జరుగుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

సంక్రాంతి సందడి



బందరులో రద్దీగా మారిన ప్రధాన రహదారి

తెలుగు సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన సంక్రాంతి సందడి నగరంలో ప్రారంభమైంది. చిన్నా పెద్దా అంతా కలిసి సంక్రాంతి వేడుకలు శనివారం నుంచి మూడు రోజులు జరుపుకునేందుకు సిద్ధమయ్యారు. నూతన వస్త్రాల కొనుగోళ్లతో వస్త్ర వ్యాపారాలు ఊపందుకున్నాయి. నగర వాసులు చెరకుగడలు, చిన్నారులకు పోసేందుకు రేగుపండ్లు కొనుగోలు చేశారు. నగర ముంగిళ్లలో రంగవల్లులు, ఆకాశంలో పతంగుల రెపరెపలు, నోరూరించే పిండివంటల ఘుమఘుమలు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల సందడి, హరిదాసు సంకీర్తనలు, గంగిరెద్దుల విన్యాసాలు సంక్రాంతి సందడిని తెచ్చాయి. ధనుర్మాసం సందర్భంగా భోగి నాడు గోదాదేవి కల్యాణం సందర్భంగా నగరంలోని రంగనాయకస్వామి ఆలయం విద్యుత్ దీపాలతో ముస్తాబైంది. విద్యా, ఉద్యోగం, వ్యాపారం నిమిత్తం ఇతర ప్రాంతాల్లో ఉంటున్న వారు నగరానికి చేరుకున్నారు. కొత్త అల్లుళ్ల రాకతో బంధుమిత్రులు, స్నేహితులంతా ఒక చోట చేరడంతో పండుగ శోభ సంతరించుకుంది.

– మచిలీపట్నం టౌన్



కొనుగోలుదారులతో రద్దీగా ఉన్న వస్త్ర దుకాణం



కిటకిటలాడుతున్న రహదారి



పండ్లు కొనుగోలు చేస్తున్న నగర వాసులు



రేగుపండ్ల కొనుగోళ్లు



చెరకుగడల విక్రయాలు

మంత్రి జోగి రమేష్ సంక్రాంతి శుభాకాంక్షలు

పెడన: రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ రాష్ట్ర, పెడన నియోజకవర్గ ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. సంక్రాంతి పండుగ తెలుగు వారి సంస్కృతి, సంప్రదాయలను ప్రతిబింబిస్తోందన్నారు. భోగి, సంక్రాంతి, కనుమ పండుగలను పల్లె, పట్టణ ప్రజలు ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఓ ప్రకటనలో మంత్రి పేర్కొన్నారు.

పేర్ని నాని శుభాకాంక్షలు..

కోనేరుసెంటర్: బందరు ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) రాష్ట్ర ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలంతా భోగభాగ్యాలతో, సిరిసంపదలతో విరాజిల్లాలని కోరుకుంటూ ప్రతి ఒక్కరు సంక్రాంతి పండుగను సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.

నూతన వస్త్రాలు పంపిణీ

మచిలీపట్నంటౌన్: 29వ డివిజన్‌లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు కార్పొరేటర్ కట్టా కేదారేశ్వర రావు శుక్రవారం నూతన వస్త్రాలను అందజేశారు. కేదారేశ్వరరావు మాట్లాడుతూ వేకువజాము నుంచే డివిజన్‌లో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచేందుకు ప్రతి రోజూ కష్టపడుతున్న కార్మికులకు వస్త్రాలను అందించడం ఆనందంగా ఉందన్నారు.

కిట్స్ అందజేత

మోపిదేవి: మోపిదేవి గ్రామ సచివాలయంలో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు రెడ్ క్రాస్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో హైజనిక్ కిట్స్, మాస్కులు, స్వెట్టర్లను శుక్రవారం అందజేశారు. సర్పంచ్ నందిగం మేరీరాణి, ఉప సర్పంచ్ కోనేరు సుందర్‌సింగ్, గ్రామ కార్యదర్శి త్రిపురసుందరి, పెదకళ్లేపల్లి వీఆర్వో రమణ, రెడ్‌క్రాస్ సంస్థ సభ్యులు రమణ, గ్రామ ప్రముఖులు నందిగం అభిషేకరావు, సునీల్, రెడ్ క్రాస్ మండల శాఖ చైర్మన్ యర్రంశెట్టి సుబ్బారావు, ఉపాధ్యక్షుడు రిమ్మనపూడి సుబ్రహ్మణ్యం, సభ్యులు పాల్గొన్నారు.

ఆనాటి ఆ స్నేహం ఆనంద గీతం



ఉపాధ్యాయులతో అర్తమూరు జెడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు



గురువులను సన్మానిస్తున్న ఎస్‌ఆర్‌వైఎస్‌పీ హైస్కూల్ పూర్వ విద్యార్థులు

చల్లపల్లి: ఎప్పుడో నలభై రెండేళ్ల కిందట కలిసి చదువుకున్న మిత్రులంతా మళ్లీ కలిశారు. ఉద్యోగం, వ్యాపారం, పెళ్లి, పిల్లలు, వాళ్ల చదువులు, వాళ్ల పెళ్లిళ్లు అంటూ నాలుగు దశాబ్దాలుగా నిత్యం ఒత్తిడితో సతమతమైన వారంతా సంక్రాంతి సెలవుల్లో తమ చిన్ననాటి బడిలో కొద్దిసేపు మళ్లీ ఆడుకుందామంటూ ఆత్మీయ కలయిక ఏర్పాటు చేసుకున్నారు. స్థానిక ఎస్ఆర్‌వైఎస్‌పీ హైస్కూల్‌లో 1980–81 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక సందడిగా జరిగింది. తాము పదో తరగతి వరకు చదువుకున్న తరగతి గదుల గోడలు, తాము కూర్చుని చదువుకున్న బెంచీలు తడిమి మురిసిపోయారు. చిన్ననాటి ఆప్తమిత్రులు పంచిన స్నేహ మాధుర్యాన్ని గుర్తు చేసుకుని మళ్లీ చిన్నపిల్లల్లా మారిపోయారు. నాటి చిలిపిచేష్టలు, అల్లరిని గుర్తు చేసుకుని ఆనందంగా గడిపారు. విద్య నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. నాటి గురువులు జవహర్, ఆర్‌వీఎస్ ప్రసాదరావు, పి.ప్రభాకరరావు, జి.విజయలక్ష్మిలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమాన్ని పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు టీఎన్‌వీ శాస్త్రి, మహమ్మద్ గౌస్, కేశనకుర్తి శరత్‌బాబు, మిక్కిలినేని మధు, అన్నవరపు పాండురంగారావు, పైడిపాముల రాజేంద్ర నిర్వహించారు.

అపూర్వం.. ఆత్మీయ సమ్మేళనం

బంటుమిల్లి: అర్తమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1997–2002 సంవత్సరంలో ఆరు నుంచి పదో తరగతి వరకు చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం శుక్రవారం జరిగింది. ఉద్యోగ, వ్యాపారాల రీత్యా వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారు పాఠశాలకు చేరుకుని నాటి మిత్రులను ఆత్మీయంగా పలుకరించి గత జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. రోజంతా వారు ఆనందంగా గడిపారు. నాడు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించి ఆశీర్వచనాలు అందుకున్నారు. ఈ సందర్భంగా అమెరికాలో స్థిరపడిన బ్యాచ్‌మేట్ మాకాల హరినాథ్ సహకారంతో విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేసేందుకు 200 కంచాలు, పాఠశాలకు ఇనుప బీరువాను బహూకరించారు. ఎంఈఓ కేఎస్‌వీ ప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొని పూర్వ విద్యార్థులను అభినందించారు. సర్పంచ్ బి. రమేష్, ఎస్‌పీసీ చైర్మన్ పి. కంట్లయ్య తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయ క్రీడలను ప్రోత్సహించాలి

ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

మోపిదేవి: సంప్రదాయ క్రీడలను ప్రోత్సహించి యువత సన్మార్గంలో నడిచేందుకు కృషి చేయాలని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. మోపిదేవి జెడ్పీ పాఠశాలలో చల్లపల్లి సర్కిల్ పరిధిలోని మోపిదేవి, చల్లపల్లి, ఘంటసాల మండలాలకు చెందిన క్రీడాకారులకు గురు, శుక్రవారాల్లో సంక్రాంతి క్రీడా పోటీలు నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం కబడ్డీ, రంగవల్లుల పోటీల్లో గెలుపొందిన విజేతలకు అవనిగడ్డ డీఎస్పీ మహబూబ్ బాషా బహుమతులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ యువతను మంచి మార్గంలో నడిపేందుకు కబడ్డీ, రంగవల్లి వంటి పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. యువత కోడిపందేలు, గుండాట వంటి జూదాలకు దూరంగా ఉండాలని చెప్పారు. సంక్రాంతి పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలన్నారు. జెడ్పీటీసీ మెడబలిమి మల్లికార్జునరావు, సర్పంచ్ నందిగం మేరీరాణి, చల్లపల్లి సీఐ భీమేశ్వర రవికుమార్, పీఏసీఎస్ మాజీ చైర్ పర్సన్ కామిశెట్టి వెంకట సురేష్‌బాబు, మాజీ సర్పంచ్ రావి నాగేశ్వరరావు, ఎస్ఐ పద్మ, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయానికి కంప్యూటర్ బహూకరణ

మోపిదేవి: స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి మోపిదేవి పీఏసీఎస్ చైర్‌పర్సన్ రావి రామప్రసాద్ శుక్రవారం తహసీల్దార్ కె. నవీన్‌కుమార్‌కు కంప్యూటర్‌ను అందించారు. పీఏసీఎస్ కార్యదర్శి మోపిదేవి శ్రీనివాసరావు, సిబ్బంది, డెప్యూటీ తహసీల్దార్ శివరామకృష్ణ, జూనియర్ అసిస్టెంట్ మోపిదేవి శ్రీనివాసరావు, వీఆర్వోలు పాల్గొన్నారు.

పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు..

సంక్రాంతి సందర్భంగా కోడి పందేలు, జూదాలు ఆడినా నిర్వహించినా చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ కె. నవీన్‌కుమార్ హెచ్చరించారు. పండుగ మూడు రోజులూ ప్రతి రోజూ బరులపై రిపోర్టు ఇవ్వాలని ఎస్ఐ పద్మకు సూచించారు.

కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు

పెడన: కోడి పందేల నియంత్రణకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని పెడన ఇన్‌చార్జి తహసీల్దార్ కె. పూర్ణచంద్రరావు అన్నారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో పోలీస్, ఎంపీడీఓ, పశుసంవర్థక శాఖ అధికారులు, సిబ్బందితో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ నిబంధనలను అతిక్రమించి పందేలు నిర్వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆర్ఐ ఎం. మణికుమార్, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బరులు సిద్ధం



బందరు మండలం మేకవానిపాలెం గ్రామంలో కోడిపందేలకు సిద్ధమైన బరులు

కోనేరుసెంటర్/ బంటుమిల్లి: కొన్ని రోజులుగా బరులు విషయంలో సందిగ్ధంలో ఉన్న నిర్వాహకులు శుక్రవారం బరి తెగించేశారు. శనివారం భోగి కావడంతో నిర్వాహకులు పోలీసుల హెచ్చరికలను సైతం పక్కనబెట్టి బరులు సిద్ధం చేశారు. శుక్రవారం మధ్యాహ్నం నుంచి విశాలమైన పొలాల మధ్య జేసీబీలతో నేలను చదును చేయించారు. రాత్రికి రాత్రే షామియానాలు, కుర్చీలు, పరదాలను పరిపించేశారు. బందరు మండల పరిధిలోని మేకవానిపాలెం, గోపువానిపాలెం, శ్రీనివాసనగర్, సీతారామపురం, గుండుపాలెం తదితర గ్రామాల్లో బరులను ఇప్పటికే సిద్ధం చేసి పందెంరాయుళ్లకు నిర్వాహకులు స్వాగతం పలుకుతున్నారు. బరులకు వచ్చే నిర్వాహకులకు సకల సౌకర్యాలు కల్పించేలా బరుల వద్ద ఏర్పాట్లు చేశారు. బంటుమిల్లి మండలం బంటుమిల్లి, పెందుర్రు, ములపర్రు, అర్తమూరు గ్రామాల్లో బరులను సిద్ధం చేస్తున్నారు. పందెం రాయుళ్లను ఆకర్షించేందుకు రూ. 2 లక్షల పందాలు ఐదింటిలో మూడు గెలిచిన వారికి బులెట్లు, పల్సర్ మోటారు సైకిళ్లు బహుమతిగా ఇచ్చేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం.

బల్లిపర్రులో పూరిల్లు దగ్ధం

పెడన: బల్లిపర్రు గ్రామంలో శుక్రవారం మధ్యాహ్నం పూరిల్లు దగ్ధమైంది. సేకరించిన వివరాల ప్రకారం.. పాత బల్లిపర్రు రోడ్డు మార్జిన్‌లో ముద్దినేని సావిత్రి(70) నివాసం ఉంటోంది. శుక్రవారం మధ్యాహ్నం వంటచేస్తున్న సమయంలో ఆమె చీరకు నిప్పంటుకోవడంతో భయపడి కేకలు వేస్తూ బయటకు పరుగులు తీసింది. ఈ సమయంలో ఇంటికి నిప్పంటుకుని మంటలు వ్యాపించాయి. ఇల్లు దగ్ధమైంది. తీవ్రంగా గాయపడిన సావిత్రిని 108 వాహనంలో మచిలీపట్నం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

వైఎస్సార్ సీపీ నేతల సాయం..

ఈ విషయాన్ని వైఎస్సార్ సీపీ నాయకులు మంత్రి జోగి రమేష్ దృష్టికి తీసుకువెళ్లారు. అనంతరం ఘటన స్థలానికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.ఐదు వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధురాలిని పరామర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కొండవీటి నాగబాబు, మాజీ ఎంపీపీ అచ్యుతరావు, వెంకట రామానాయుడు, బెజవాడ నాగబాబు, రాంబాబు, బెనర్జీ పాల్గొన్నారు.

- పుల్లపాడు గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ లక్ష్మణరావు అనారోగ్యంతో శుక్రవారం మృతిచెందాడు. ఆయన కుటుంబ సభ్యులను వైఎస్సార్ సీపీ నాయకులు పరామర్శించి మట్టి ఖర్చుల నిమిత్తం రూ.ఐదు వేలను అందజేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు వెంకట రామానాయుడు, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ. 50 వేల విరాళం

మోపిదేవి: మోపిదేవి వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి దేవస్థానంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదానానికి కొవ్వూరుకు చెందిన బోలేపల్లి వెంకట అప్పలకొండ రూ. 50 వేలు విరాళంగా అందజేశారు.

శుక్రవారం ఉదయం స్వామివారిని దర్శించుకున్న ఆయన ఆలయ అధికారి రామకృష్ణకు విరాళాన్ని అందించారు.

గోదాదేవికి సారె సమర్పణ

అవనిగడ్డ: స్థానిక గీతా మందిరంలో గోదాదేవికి పలు ప్రాంతాలకు చెందిన భక్తులు సారె, నూతన వస్త్రాలు సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక భజనలు, భక్తి గీతాలు ఆలపించారు. కార్యక్రమాన్ని ఆలయ కమిటీ చైర్మన్ యర్రంశెట్టి శ్రీహరి, భోగాది రాము పర్యవేక్షించారు.

ఉత్సాహంగా రంగవల్లుల పోటీ

విజేతలకు బహుమతులు అందజేత

కృత్తివెన్ను: సంక్రాంతిని పురస్కరించుకుని సంగమూడి ఉన్నత పాఠశాల ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించిన ముగ్గుల పోటీ మహిళల్లో ఉత్సాహాన్ని నింపింది. అమెరికన్ ప్రోగ్రెసివ్ తెలుగు అసోసియేషన్ (ఆప్తా) ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు. తెలుగుదనం ఉట్టిపడేలా, సంప్రదాయాన్ని చాటిచెప్పేలా మహిళలు అందంగా అలంకరించిన రంగవల్లులు ఆకర్షణీయంగా నిలిచాయి. పోటీల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విజేతలకు నగదు బహుమతులు, పోటీల్లో పాల్గొన్న అందరికీ ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో వట్టికూటి రామచంద్రరావు, కూనసాని శ్రీనివాసరావు, వెంట్రపాటి నాగరాజు, కూనసాని నాగు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

చిలకలపూడి(మచిలీపట్నం): నగరంలోని వివిధ అంగన్‌వాడీ కేంద్రాలను శుక్రవారం జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి పి. పార్వతి తనిఖీ చేశారు. నగరంలోని సర్కారుతోట, విశ్వబ్రాహ్మణ కాలనీ, చిలకలపూడిలోని కేంద్రాలను తనిఖీ చేసి సరఫరా అవుతున్న కందిపప్పు నాణ్యతను పరిశీలించారు. కందిపప్పును ఉడికించి రుచి చూశారు. డీఎస్ఓ మాట్లాడుతూ కందిపప్పు నాణ్యత బాగుందని, అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలు, కార్డుదారులు కందిపప్పు విషయంలో ఎటువంటి అపోహలు పెట్టుకోవద్దని, రేషన్ వాహనాల ద్వారా సరఫరా అయ్యే కందిపప్పును తీసుకుని వినియోగించుకోవాలన్నారు.

కార్డుదారులందరికీ రూ. 67కే కిలో కందిపప్పును అందజేస్తున్నారని చెప్పారు. కార్డుదారులందరూ వినియోగించుకోవాలని సూచించారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

పెడన: ప్రకృతి వ్యవసాయంపై ప్రతి రైతు దృష్టి సారించడం ద్వారా మానవాళికి ఎంతో మేలు కలుగుతుందని కృష్ణా జిల్లా ప్రకృతి వ్యవసాయాధికారి కె. పార్థసారథి అన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని నందమూరు రైతు భరోసా కేంద్రంలో మహిళా సంఘాలకు, రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులు ప్రకృతి సేద్యంలో తీసుకోవాల్సిన మెలకువలు తెలుసుకోవాలన్నారు. తద్వారా అధిక దిగుబడులతో లాభాలు పొందవచ్చని చెప్పారు.

విత్తనాలు శుద్ధి చేయడం, పురుగు మందుల పిచికారీ, సేంద్రియ ఎరువుల తయారీ తదితరాలను వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏఓ జీవీ శ్రీనివాసరావు, సర్పంచ్ నరసింహారావు, ఎంపీటీసీ కుమార్, కిషోర్, శివనాగరాజు, వీఓఏ కీర్తి, ఓ స్వామిబాబు, మహిళా సంఘాల సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం

మచిలీపట్నంటౌన్: 31వ డివిజన్ శారదా నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన 63 కేవీ నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను వైఎస్సార్ సీపీ నాయకుడు పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) శుక్రవారం ప్రారంభించారు. లో ఓల్టేజీ సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పర్యటించిన సందర్భంగా స్థానిక ప్రజలు పేర్ని కిట్టు దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఈ ప్రాంతంలో నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని విద్యుత్‌శాఖ అధికారులను పేర్ని కిట్టు కోరారు. విద్యుత్‌శాఖ అధికారులు ఈ ప్రాంతంలో నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. కార్పొరేటర్ యంత్రపాటి నాగేశ్వరరావు, మాజీ కౌన్సిలర్ కొక్కిలిగడ్డ శరత్‌కుమార్, ఎలక్ట్రికల్ ఈఈ ఎం. భాస్కరరావు, ఏడీఈ రామకృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకులు మేడెంపూడి అనిల్ బాబు, మెహర్, మైఖేల్ పాల్గొన్నారు.

బార్‌లో ఘర్షణ.. పలువురికి గాయాలు

కోనేరుసెంటర్: మద్యం మత్తులో ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో పలువురికి గాయాలయ్యాయి. చిలకలపూడి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇనగుదురుపేటకు చెందిన అన్సర్ హైదర్ మరో ఇద్దరు స్నేహితులు శుక్రవారం ఉదయం 11 గంటల సమయంలో మద్యం సేవించేందుకు బస్టాండ్ సెంటర్ సమీపంలోని బార్‌కు వెళ్లారు. ముగ్గురు కలిసి మద్యం సేవిస్తుండగా అప్పటికే పక్క టేబుల్‌లో ఉన్న స్నేహితులు శరత్‌కుమార్, వినీత్, వీరాంజనేయులు, దత్తు మద్యం మత్తులో గలాటా చేశారు. హైదర్ వారి అల్లరిని ఆపమని చెప్పడంతో ఆగ్రహానికి గురైన శరత్‌కుమార్ అతని స్నేహితులు హైదర్‌తో ఘర్షణకు దిగారు. మద్యం మత్తులో ఇరు వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. శరత్‌కుమార్ అతని స్నేహితులు బీర్ సీసాలతో హైదర్‌తో పాటు అతని స్నేహితుడు ఇలియాస్‌పై దాడి చేశారు. హైదర్ తలకు గాయం కాగా ఇలియాస్‌ను పొట్టలో పొడిచారు. తీవ్రంగా గాయపడిన ఇద్దరిని చికిత్స నిమిత్తం బందరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాధితుడు హైదర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జిల్లా హాకీ జట్టుకు వాసవి విద్యార్థుల ఎంపిక



కృష్ణా జిల్లా హాకీ జట్టుకు ఎంపికైన విద్యార్థులతో చైర్మన్ ప్రసాద్ తదితరులు

పెడన: రాష్ట్ర జూనియర్ హాకీ టోర్నమెంట్‌లో పాల్గొనే కృష్ణా జిల్లా హాకీ జట్టుకు పెడన మండలం నందమూరు శ్రీ వాసవి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ఎనిమిది మంది ఎంపికయ్యారని కళాశాల ఫిజికల్ డైరెక్టర్ శ్రవణం రామకృష్ణ శుక్రవారం తెలిపారు. కె. శివనాగచంద్, ఎం. కనక సురేష్, ఎండీ మస్తాన్, ఎం. భాస్కరరావు, పి. వెంకటేష్, బాజీఖాన్, జి. మనోజ్‌కుమార్ ఎంపికయ్యారన్నారు. వీరు ఈ నెల 14 నుంచి 16వ తేదీ వరకు కర్నూలు జిల్లా నంద్యాలలో జరిగే అంతర్రాష్ట్ర హాకీ టోర్నమెంట్‌లో కృష్ణా జిల్లా జట్టు నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని చెప్పారు. విద్యార్థులను కళాశాల చైర్మన్ గుడివాడ ప్రసాద్, కార్యదర్శి మెహర్‌బాబా, కరస్పాండెంట్ కుమార్‌బాబు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు సాయికుమార్, బాబా, ప్రిన్సిపాల్ రాజు తదితరులు అభినందించారు.